క్లుప్తంగా

వృత్తి విద్యా కోర్సులతో మంచి భవిష్యత్



జూలకల్ సచివాలయంను సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

గూడూరు రూరల్: వృత్తి విద్యా కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపల్ దిల్షాద్ పేర్కొన్నారు. జూలకల్‌లోని గ్రామ సచివాలయాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సచివాలయాన్ని సందర్శించామన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై విద్యార్థులు ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారన్నారు. వృత్తి విద్యా కోర్సులను చేసిన వారికి స్వయం ఉపాధి అవకాశంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పొందవచ్చునని ఆమె తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.418 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ



లక్ష్మీదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హమీద్

కోడుమూరు రూరల్ : మండలంలో ఫిబ్రవరి ఒకటవ తేదీ గురువారం పింఛన్ల పంపిణీ పండుగ మొదలైంది. తెల్లవారుతూనే వలంటీర్లు వృద్ధులు, వితంతులు, వికలాంగుల ఇళ్ల వద్దకు చేరుకుని వైఎస్సార్ పింఛన్ కానుక నగదు అందజేశారు. సాయంత్రానికి కోడుమూరు మండలంలో 9,190 మంది ఉండగా 6,045 మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు.

సి.బెళగల్ తహసీల్దార్ బదిలీ



శేషఫణిని సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: సి.బెళగల్ మండల తహసీల్దార్ శేషఫణి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, వీఆర్వోలు గురువారం తహసీల్దార్ శేషఫణిని సన్మానించారు. శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ ఆదినారాయణ, మండల సర్వేయర్ నాగభూషణం, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల ఖాజీగా మౌలానా అబ్దుల్ రెహమాన్



గడివేముల: మండల ప్రభుత్వ ఖాజీగా గడివేములకు చెందిన ఖాజీ మౌలానా షేక్ అబ్దుల్ రెహమాన్ రషాది నియమితులయ్యారు. ఈ మేరకు మైనార్టీ వ్యవహారాలు, సంక్షేమ కార్యదర్శి ఇంతియాజ్ జీఓ నంబర్ 8 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈయన 10 సంవత్సరాలు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ ఖాజీగా నియమితులైన రహమాన్‌ను పలువురు ముస్లిం సోదరులు బీసీ కాలనీలోని మసీదులో గురువారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి



గడివేముల స్కూల్‌లోని పాల్‌ల్యాబ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా నోడల్ ఆఫీసర్ దస్తగిరి రెడ్డి అన్నారు. గురువారం గడివేముల, గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పాల్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్ (పాల్) ల్యాబ్ ద్వారా విద్యార్థులకు గణితం సబ్జెక్టు అర్థమయ్యే రీతిలో సాంకేతికతను జోడించి, టాబ్‌ల ద్వారా బోధించడం జరుగుతోందన్నారు. వెంకటరమణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మస్తాన్, ఉపాధ్యాయులు మాతృనాయక్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

మెగా డీఎస్సీ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): 25 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం వారు వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. 5 ఏళ్ల తరువాత 6 వేల పోస్టులతో డీఎస్సీని విడుదల చేయడమంటే నిరుద్యోగులను మోసగించడమేనన్నారు. రెండేళ్ల అప్రెంటిషిప్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

పేదల చదువులకు భరోసా

- అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి కింద ప్రభుత్వ ఆర్థిక సాయం
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సంవత్సరాల వారీగా మండలంలో అమ్మఒడి లబ్ధిదారుల వివరాలు..

సంవత్సరం	విద్యార్థులు	అమ్మ ఒడి లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
2020-21	6.551	3.472	4.8608
2021-22	7.694	4.194	5.4522
2022-23	6.876	3.588	4.6654



ఆళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

గడివేముల: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ చదువు మానేయకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు. ఇందులో భాగంగా నవరత్నాల్లో అమ్మఒడి పథకాన్ని చేర్చారు. ఏటా విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు చొప్పున నిధులు జమ చేస్తున్నారు. వీటితో పాటు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం తమ పిల్లలకు కొండంత ఆలంబనగా ఉందన్న ఆనందం పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

అమ్మఒడి కింద ఏటా రూ.15వేలు సాయం

పేద కుటుంబాలు ఆర్థిక స్తోమత లేని కారణంగా తమ పిల్లలను బడి మాన్పించకుండా అమ్మఒడి పథకం ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు పాఠశాలకు, కళాశాలలకు పంపించే పిల్లల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15వేలు జమ చేస్తోంది. ఇక ఇంటర్ చదువు ఆపకుండా ఉన్నతవిద్య చదుకునే వారికోసం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఏటా రూ.8,750 చొప్పున ఏడాదికి మూడు విడతల్లో రూ.26,250 (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు, కళాశాల ఫీజులు బట్టి) చెల్లిస్తోంది. వసతిగృహాల్లో ఉంటూ చదువుకునే వారికోసం జగనన్న విద్యావసతి (రియంబర్స్‌మెంట్ ఆఫ్ మెయింటినెన్స్ ఫీజు) పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు రెండు విడతల్లో చెల్లిస్తోంది. జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ మూడు పథకాల వల్ల ఏటా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు ఎటువం టి ఆర్థిక ఇబ్బంది లేకుండా పూర్తి చేస్తున్నారు.

బడికి పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు



అమ్మఒడి పథకంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అందిస్తున్న సొమ్ముతో తమ పిల్లలను మంచి చదువులు చదివించాలన్న ఆలోచన వచ్చింది. పిల్లలను బడికి పంపించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

–విమలా వసుంధరదేవి, ఎంఈఓ–2, గడివేముల

జగనన్న సాయం ఆదుకుంది



నేను, నా భర్త మధు కలిసి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నా కుమారుడు స్థానిక రాజరాజేశ్వరీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. పేద కుటుంబంలో ఉన్న మాలాంటి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదువులు చదివించాలంటే సాధ్యం కాదు. వ్యాపారంపై అరకొర వచ్చిన డబ్బుల మీదనే కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి. జగనన్న అమ్మ ఒడి పథకంతో మేనమామలా అండగా ఉంటూ ఆర్థిక సాయం అందించడం మా అదృష్టం. సీఎం జగన్ సార్‌కు రుణపడి ఉంటాం. –కొమ్ము రమాదేవి, గడివేముల

అమ్మఒడి ఎంతో ఉపయోగపడుతుంది



మా పిల్లల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నా కుమారుడు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్నాడు. నా భర్త వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ, నేను కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి డబ్బులు నా అకౌంట్‌లో జమ చేశారు. దీంతో పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. – ధరణి,చిందుకూరు గ్రామం

నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య
- 20వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణ



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య

కల్లూరు : నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలో నందికొట్కూరు రోడ్డులోని ఓమేగా ఆస్పత్రి నుంచి నంద్యాల రోడ్డు వరకు 100 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలో కాలనీల్లో ప్రాధాన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలు నగర అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నగర పాలికకు ఎన్నికలు నిర్వహించడంతో పాలక వర్గం ఏర్పడిందన్నారు. పాలక వర్గం ఏర్పడడంతో నగరం అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని కోరారు. చంద్రబాబు నాయుడు 2014లో 600పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, శ్వేతారెడ్డి, అరుణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు భీమాశంకర్‌రెడ్డి, యూనస్, రంగారెడ్డి, డీఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ రాముడును సన్మానిస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప, అధికారులు

సి.బెళగల్: ఎన్నికల బదిలీలో భాగంగా సి.బెళగల్ నుంచి అనంతపురం జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీఓ ఏసీ రాముడిని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓకు ఎంపీపీ బొంతల మునెప్ప, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, మండల జేసీఎస్ కన్వీనర్ సీబీ తులసీరెడ్డి సంగాల సర్పంచ్ హనుమంతు తదితరులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ గంగరాజు, ఎంఈఓ ఆదామ్‌బాషా, ఏపీఓ లక్ష్మన్న, ఆయా గ్రామాల పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి విజయ వనం

కర్నూలు కల్చరల్: విజయవనం పుల్లయ్య పార్క్‌ను సందర్శకులకు అందుబాటులోకి తెచ్చామని జిల్లా అటవీ శాఖ అధికారి పల్లె శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విజయ వనం పుల్లయ్య పార్క్‌ను సందర్శించారు. మొదటి రోజు 34 మంది సందర్శకులు పార్క్‌ను సందర్శించారన్నారు. టికెట్ల రూపంలో రూ.680 సమకూరిందన్నారు. సందర్శకుల తాడికి పెరిగే అవకాశం ఉందన్నారు.

పేదలకు స్థలాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాల యం సమీపంలోని కేసీ కెనాల్‌పై ఇంటి స్థలం లేని పేదలు, జగనన్న కాలనీలు, టిడ్కో గృహాలు మంజూరైన లబ్ధిదారులతో వారు సమావేశమయ్యారు. పి.రామకృష్ణారెడ్డి, మునెప్ప, మహేష్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ఇంటి ముంగిటకే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ రామగిడ్డయ్య



కోడుమూరులో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాన్ని పరిశీలిస్తున్న రామగిడ్డయ్య

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలతో ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా.రామగిడ్డయ్య అన్నారు. గురువారం కోడుమూరులోని గ్రామ సచివాలయం-4 పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డా.రామగిడ్డయ్య తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించడంతో పాటు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డా.రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్య పరంగా సురక్షితంగా ఉంచడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద హాస్పిటల్స్‌లో వైద్య చికిత్సలు చేయించుకున్న వ్యక్తులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం కోడుమూరులో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాన్ని డా.రామగిడ్డయ్య సందర్శించి కరెంట్, నీటి కుళాయి కనెక్షన్ల త్వరగా వేయించాలని వైద్యాధికారి డా.శ్రీమంత్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లలిత జ్యోతి, ఏఎన్ఎం సుగుణమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి పైపులు ధ్వంసం



తాగునీటి కుళాయిలను విరగొట్టిన దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో దుండగులు హల్‌చల్ చేశారు. రాత్రి వేళలలో పాఠశాలలో మంచినీటి పైపులైన్లు, ట్యాంక్‌లు, మరుగుదొడ్ల తలుపులు, వైర్లు, మోటార్ వైర్లు ధ్వంసం చేశారు. కుళాయిలను విరగొట్టి పడేశారు. పిల్లలకు తాగడానికి మంచినీరు లేకుండా చేశారు. అంతేకాక పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు, విచ్చలవిడిగా పడేసి పగులగొట్టారు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం కేశవ్, సిబ్బంది జరిగిన ఈ ఘటనను ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆధ్వర్యంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ హరిగోపాల్

పాణ్యం : 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా రాష్ట్రం ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ సూచించారు. గురువారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో వర్క్ఇన్‌స్పెక్టర్లకు, గ్రామ సచివాలయాల ఇంజినీర్లతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా చైతన్యం తేవాలన్నారు. బేస్, స్లాబ్, లెంటల్ లెవెల్‌లో ఉన్న వాటిని ఈనెల చివరి నాటికి పూర్తి చేసేలా చూడాలన్నారు. అలాగే ఇళ్లు పూర్తి చేసుకున్న వారికి మరుగుదొడ్లు మంజురు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సచివాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఈ సుబ్బారెడ్డి, ఏఈ అన్వర్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై సోమవారం నుంచి మొదలైన ప్రజాభిప్రాయ సేకరణ గురువారం ముగిసింది. సోమవారం నుంచి బుధవారం వరకు విశాఖపట్టణం నుంచి విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు సంతోష్‌రావు, పృధ్వీతేజ్, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, గురువారం ఏపీ ఏపీ జెన్‌కో అధికారులు తాము ప్రతిపాదించిన వాటి వివరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిపాదనలపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి సుమేర్ సోలార్ ప్లాంట్, సాయి అచ్యుత్ సోలార్ ప్లాంట్, క్రాంతి బ్రదర్స్ సోలార్ ప్లాంట్స్ ప్రతినిధులు కొన్ని సూచనలు చేశారు. తమపై గ్రిడ్ సపోర్టు చార్జీలు వేస్తుండటం వల్ల భారం పడుతోందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే వారిపై కేడబ్ల్యూహెచ్ బిల్లింగ్‌తో పాటు కేవీఏహెచ్ బిల్లింగ్ వేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడే అవకాశం లేదని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పష్టం చేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, డోన్ కేంద్రాలుగా వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. కర్నూలు నుంచి ఎస్ఈ ఉమాపతి, డీఈ చక్రపాణి పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్



సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాదిరూతమ్మ

కోడుమూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు నేరుగా అందజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగనన్న అంకితభావంతో కృషి చేస్తున్నారన్నారు. మండల పరిధిలోని పులకుర్తి గ్రామంలో గురువారం జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ తదితర నాయకులతో కలిసి ఆదిమూలపు సతీష్ పర్యటించారు. త్వరలో అనంతపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న 'సిద్ధం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జెడ్పీటీసీ, ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ అనంతపురంలో సీఎం జగనన్న నిర్వహించే సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఎల్లో మీడియాతో కలిసి అసత్యారోపణలు చేస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులు, జిమ్మిక్కులకు పాల్పడుతున్నారన్నారు. నెరవేర్చలేని హామీలను ఇచ్చి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ కుట్రరాజకీయాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. అదేవిధంగా ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేకూరిన మేలును వివరించాలని సూచించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, పులకుర్తి సత్యారెడ్డి, సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీ ఇందిరవరప్రభ, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మండల కన్వీనర్ రమేష్ నాయుడు, స్థానిక నాయకులు వెంకటేష్, నాగేంద్ర, శంకర్, హనుమంతు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

పాణ్యం : మండల తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై తిరుపతికి వెళ్లిన శ్రీనివాసులు గౌడ్‌ను స్థానిక రెవెన్యూ కార్యాయంలో గురువారం సన్మానం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఓ మహబూబ్‌బాషా, మండల సర్వేయర్ మల్లెశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రిక్రూట్‌మెంట్ నిలిపివేత

కర్నూలు(హాస్పిటల్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్‌టీఈపీలోని గత ఆగస్టు 30న క్షయ వ్యాధి నివారణ కేంద్రంలో ఇచ్చిన నోటిఫికేషన్ రిక్రూట్‌మెంట్ నిలిపివేసినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మెడికల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ పీపీఎం కో ఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టీబీ, హెచ్ఐవీ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్, ట్యూబరోకులోసిస్ హెల్త్ విజిటర్, అకౌంటెంట్ పోస్టులు ఉన్నాయన్నారు. కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌హెచ్‌ఎంలో ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పోస్టులన్నీ ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వారు నిర్వహిస్తారన్నారు.

పనులు పూర్తి చేయండి

కర్నూలు (టౌన్): నగర పాలక పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం బిర్లాగేట్ జంక్షన్, బళ్లారి చౌరస్తా వద్ద అండర్ పాస్ అభివృద్ధి పనులు, మౌర్య ఇన్ వద్ద స్ట్రీట్ స్కేపింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిని ఇంజినీరింగ్ విభాగం ఈఈ షాకీర్ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్ : కోడుమూరు ఐసీడీఎస్ పరిధిలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల్లో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ టీచర్, 10ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి-1 అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ ఎస్సీ రిజర్వ్‌డు ఖాళీగా ఉండగా, కోడుమూరు మండలంలోని కొత్తపల్లె అంగన్‌వాడీ సెంటర్ ఓసీ రిజ్వరుడు ఆయా పోస్టు ఖాళీగా ఉందన్నారు. అలాగే కోడుమూరు-9 ఎస్సీ, కర్నూలు మండలంలోని నిడ్జూరు-3 ఎస్టీ, జి.సింగవరం-2 ఓసీ, గార్గేయపురం-2 ఓసీ, సి.బెళగల్ మండలంలోని గుండ్రేవుల-1 బీసీ-బీ, కొత్తకోట-4 ఓసీ, తిమ్మందొడ్డి ఈడబ్ల్యూఎస్, మారందొడ్డి -2 ఓసీ, గూడూరు మండలంలోని మునగాల-1 బీసీ-సీ రిజర్వుడ్ ఆయాపోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీఓ చెప్పారు. పది పాసై, 01-07-23నాటికి 21సంవత్సరాలు నిండి 35సంవత్సరాల్లోపు ఉండాలని, తప్పనిసరిగా వివాహితురాలై స్థానికంగా ఉన్న వారు అర్హులన్నారు. ఈనెల 7వతేదీలోగా కోడుమూరు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సీడీపీఓ వరలక్ష్మి పేర్కొన్నారు.

తెల్లవారకముందే పింఛన్ల పంపిణీ



తిరుపాడులో నగిరి సరోజమ్మకు వికలాంగుల పింఛన్ అందిస్తున్న వలంటీరు దూదేకుల ఉశేన్



చిన్నటేకూరులో లక్ష్మమ్మ నుంచి వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ రామ్‌గోపాల్

గడివేముల: వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు అందించారు. గతంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులను అందిస్తున్నారు. మండలంలో 5,864 పింఛన్లు ఉండగా తొలిరోజు 3,638 మంది లబ్ధిదారులకు అందించారు.

65 శాతం పింఛన్ల పంపిణీ

కల్లూరు : నెల మొదటి రోజు కావడంతో వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు వలంటీర్లు ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం సాయంత్రానికి మండలంలో 65శాతం మందికి పింఛన్లు పంపిచేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 8,479 మంది పింఛన్లు దారులు ఉండగా మొదటిరోజు 5,585 (65శాతం) మందికి నగదు అందజేశారు.

విఫ్స్ కార్యక్రమం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్):రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత గురువారం నగరంలోని గడ్డ ధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని దండిగేరిలో మోతీయ ఉర్దూ పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నులి పురుగులు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే అతిగా ఆకలి వేయడం, ఆకలి లేకపోవడం, రక్తహీనత, దగ్గు, వికారం, వాంతులు ఉంటాయన్నారు.